క్లుప్తంగా

గిరిబాబుకు సత్కారం



గిరిబాబును సత్కరిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల, వెంకటరావు

మద్దిలపాలెం : జీవీఎంసీ జోన్–3 స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా నియామకమైన అడ్వకేట్ అప్పారి గిరిబాబును వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల శుక్రవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు, ఏపీ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

'దరిద్రాన్ని పోగొట్టే శక్తి స్వరూపిణి దుర్గమ్మ'



ప్రవచిస్తున్న బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి

ఏయూ క్యాంపస్: మానవులకు కలిగే దుఃఖాన్ని, దరిద్రాన్ని హరించే శక్తి రూపిణిగా దుర్గాదేవి నిలుస్తుందని నమిశారణ్య పీఠాధిపతి శ్రీబాల బ్రహ్మానంద సరస్వతీ స్వామి అన్నారు. శుక్రవారం సాయంత్రం పెదవాల్తేరు పోలమాంబ ఆలయంలో దేవీ భాగవత సారాంశప ప్రవచనం అందించారు. ఈ సందర్భంగా బ్రహ్మానంద స్వామి మాట్లాడుతూ దుర్గ నామాన్ని ఆశ్రయిస్తే మానవాళి సురక్షితంగా ఉన్నట్లేన్నారు. జన్మజన్మలుగా ఉన్న దరిద్రాన్ని పోగొట్టే స్వరూపిణిగా దుర్గనామం ఉందన్నారు. ప్రాంతాల వారీగా అమ్మవారిని విభిన్న రూపాలు, పేర్లతో పిలవడం, ఆరాధించడం పరిపాటిగా మారిందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే 183 దేవస్థానాలలో అమ్మవారి ప్రవచనాలు నిర్వహించినట్టు చెప్పారు. అనంతరం ఆలయ ఈవో డి.వి.ఎస్. సురేష్‌బాబా, ధర్మకర్తల మండలి సభ్యులు స్వామీజీని సత్కరించారు. అనంతరం స్వామీజీ పోలమాంబ అమ్మవారిని దర్శించుకుని, ఆశీస్సులు తీసుకున్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న రాయప్రోలు రమణి

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం నిర్వహించిన కర్ణాటక సంగీత గాత్ర కచేరీ ఆహూతులను అలరించింది. డాక్టర్ రాయప్రోలు రమణి పలు భక్తి కీర్తనలు ఆలపించారు. గిరిరాజ సుత, శ్రీ మీనాక్షి, ఆనందామృత, బాగు మీరగాను, శ్యామల దండకం, గీతాధునిక, వందనద్యుతి, క్షీరాబ్ధి కన్యకకు కీర్తనలు అలరించాయి. ఈమెకు ఎస్.కృష్ణప్రియ వయోలిన్‌పై, టి.ఎస్. చైతన్య మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ గాయని రమణిని సత్కరించారు.

చార్లీ చాప్లిన్ జయంతి రేపు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 16న ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రఖ్యాత హాస్యనటుడు చార్లీ చాప్లిన్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు చార్లీ చాప్లిన్ చిత్రపటానికి నివాళులు అర్పించడంతో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అనంతరం 1940లో చాప్లిన్ నటించి, దర్శకత్వం వహించిన 'ది గ్రేట్ డిక్టేటర్' అనే సినిమాను ప్రదర్శిస్తామని చెప్పారు. దీనికి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్టు తెలిపారు.

ఆదర్శనీయుడు అంబేడ్కర్

- మేయర్ హరివెంకటకుమారి
- వాడవాడలా భారత రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి



కృష్ణా కళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు, అధ్యాపకులు



11వ వార్డులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ఆరిలోవ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ నేటి తరానికి ఆదర్శవంతుడని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. తూర్పు నియోజకవర్గం పరిధిలో అంబేడ్కర్ జయంతిని శుక్రవారం వాడవాడలా నిర్వహించారు. జీవీఎంసీ 11వ వార్డు అంబేడ్కర్‌నగర్‌లో అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మహనీయుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగం ప్రకారం రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, మార్కెటింగ్ శాఖ మాజీ చైర్మన్ అల్లంపల్లి రాజబాబు, కె.మోహనరావు, మూర్తి, నరసింగరావు, విక్టర్, ఈశ్వరరావు, రామారావు, బాబూరావు, చంద్రరావు, గణపతి శ్రీకాంత్, శ్రీరాములు పాల్గొన్నారు. ఇదే వార్డులో సీపీఎం, సీపీఐ, టీడీపీ నాయకులు కూడా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

- జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, మాజీ కార్పొరేటర్ జగ్గుపిల్లి అప్పలరాజు, విద్యా విభాగం డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవీంద్రనగర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి స్థానిక కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, నాయకులు అంజలి ఘటించారు.
- జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలిలో అంబేడ్కర్ విగ్రహానికి కార్పొరేటర్ అక్కరమాని రోహిణి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మల శ్రీనివాస్, కొండమ్మ, రాజేష్ పాల్గొన్నారు.

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని హిడెన్ స్ప్రౌట్స్ మానసిక వికలాంగుల పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం చిన్నారులతో కేక్ కట్ చేశారు. విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఎస్.రవి కుమార్, పి.శంకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, పాఠశాల నిర్వాహకుడు కండిపిల్లి శ్రీను పాల్గొన్నారు.

- ఏయూ న్యాయ కళాశాల వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపకుడు సుంకరి రమణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సేన క్యాంపస్ ఇన్‌చార్జి ఎస్.శ్రీరామ్, తాతారావు, సన్యాసి నాయుడు, నర్సింగరావు పాల్గొన్నారు.
- ఏయూ పరిపాలన భవనం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఏయూ వైఎస్ఆర్ స్టూడెంట్ యూనియన్ నాయకులు పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు నమ్మి లక్ష్మణ్ కుమార్, కర్నేటి సాయి కృష్ణ, జానీ, పృధ్వీ, వెంకటేష్, వివేక్ నాయుడు పాల్గొన్నారు.

మద్దిలపాలెం : స్థానిక కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, అధ్యాపకులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. 15, 16వ వార్డుల్లో సీపీఎం ఆధ్వర్యంలో అంబేడ్కర్ ఫ్లెక్సీకి పార్టీ నాయకుడు పడాల గోవింద్ క్షీరాభిషేకం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇసుకతోట రెల్లివీధిలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జగన్ మురారీ, భూపతి శ్రీనివాసరావు పాల్గొన్నారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మద్దిలపాలెంలోని కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. 16వ వార్డు ఇసుకతోట అంబేడ్కర్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు సిద్ధార్థనగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వీఎంఆర్‌డీఏ అక్కరమాని విజయనిర్మల పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, సిద్ధార్థనగర్ గ్రామ పెద్దలు సీతారాం, బుడుమూరు ఈశ్వరరావు, శశికళ పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ యూనిటీ నాయకులు



22వ వార్డు సిద్ధార్థనగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అక్కరమాని విజయనిర్మల



భానోజీనగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

28వ వార్డులో విగ్రహావిష్కరణ

జీవీఎంసీ 28వ వార్డు బానోజీనగర్‌లో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని కార్పొరేటర్ పల్లా అప్పలకొండ ఆవిష్కరించారు. అనంతరం పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

సీబీఎం కాంపౌండ్ సమీప అమర్‌నగర్‌లో పూలే అంబేడ్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అదజేశారు.

13వ వార్డులో విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సీఐడీ డీఎస్పీ కాళిదాసు, కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పైనాపిల్ కాలనీ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో స్థానికులు అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని సీఐడీ డీఎస్పీ కాళిదాస్, కార్పొరేటర్ కెల్ల సునీత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రూపావతి, శ్రీకృష్ణాపురం గురుకులం రిటైర్డ్ ప్రిన్సిపాల్ కె.కోటేశ్వరరావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, మంగరాజు, వీర్రాజు, టీడీపీ నాయకులు పాత్రకొండ ధర్మారావు, టి.బాల స్వామి పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలు యువతకు స్ఫూర్తిదాయకం



ఏయూలో అంబేడ్కర్ విగ్రహం వద్ద అంజలి ఘటిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, అధ్యాపకులు

ఏయూ క్యాంపస్: రాజ్యాంగ విలువలు యువతకు స్ఫూర్తిదాయకమని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఏయూ న్యాయ కళాశాల, ఏయూ పరిపాలన భవనం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టీఎల్ఎన్ సభా మందిరంలో ఏర్పాటు చేసిన సదస్సులో వీసీ మాట్లాడుతూ అంబేడ్కర్ నిర్మించిన బలమైన పునాదులపై విద్యార్థులు తమ ఆశల సౌధాన్ని నిర్మించుకోవాలని సూచించారు. రెక్టార్ ఆచార్య కె.సమత, విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఆచార్య పి.అర్జున్, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డీన్‌లు ఆచార్య కిషోర్‌బాబు, సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

'నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ ఫలాలు'



పథకాల గురించి వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల

మద్దిలపాలెం: దళారుల బెడద లేకుండా లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురంలో కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాల గురించి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు పథకాల మంజూరు కోసం వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి దేశంలో చరిత్ర సృష్టించారన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు అప్పారి గిరిబాబు, పార్టీ వార్డు అధ్యక్షుడు వెంకట్, వెంకటలక్ష్మి, నరాల సత్తిబాబు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సందేశాత్మకంగా నాటక ప్రదర్శనలు



సహ ప్రయాణం నాటకంలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ(వీఎండీఏ) ఆధ్వర్యంలో పైడా కౌశిక్ రాష్ట్రస్థాయి నాటక పోటీలు చక్కని సందేశాత్మక ప్రదర్శనలతో ప్రశంసలు పొందుతున్నాయి. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం నాటక పోటీలను వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్ఎన్ రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, ట్రస్టీ పైడా కృష్ణప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలి ప్రదర్శనగా గుంటూరుకు చెందిన శ్రీసద్గురు కళా నిలయం ఆధ్వర్యంలో సహ ప్రయాణం నాటకం ప్రదర్శించారు. పగటి వేషాల ద్వారా ప్రజలకు చక్కని సందేశాన్ని ఇవ్వాలనే సదుద్దేశంతో కళాసేవకు చేసిన ప్రయాణాన్ని ఇతివృత్తంగా సాగిన ఈ నాటకం ప్రేక్షకుల మన్ననలు పొందింది. ఈ నాటకాన్ని ఆకెళ్ల వెంకటసూర్యనారాయణ రచించగా, బసవరాజు జయశంకర్ దర్శకత్వం వహించారు.

- రెండో ప్రదర్శనగా పెదకాకానికి చెందిన గంగోత్రి వారిచే పేగు రాసిన శాసనం నాటకం ఆకట్టుకుంది. పేగు బంధం పేరిట వర్తమానంలో పిల్లలు ఆడుతున్న వింతనాటానికి కన్నవారే తెరవేయాలి అనే కథాంశంతో ప్రతి సన్నివేశాన్ని ఎంతో గొప్పగా ప్రదర్శించి అబ్బురపరిచారు. ఈ నాటికను చింతకింది శ్రీనివాసరావు రచించగా, నాయుడు గోపి దర్శకత్వం వహించారు.

16న 'ఆశువుగా హాస్యం'



కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: క్రియేటివ్ కామెడీ క్లబ్, హాస్య ప్రియ కామెడీ క్లబ్ సంయుక్త నిర్వహణలో ఈ నెల 16న ద్వారకానగర్ పౌరగ్రంథాలయం వేదికగా 12 గంటల నిర్విరామ 'ఆశువుగా హాస్యం' నిర్వహించనున్నట్టు నిర్వాహకులు వేముల భాస్కరాచారి, పెసల కనకదుర్గాప్రసాద్ తెలిపారు. శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఆ రోజు ఉదయం 6.30 నుంచి సాయంత్రం 6.30 వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. హాస్య ప్రియులు పాల్గొనాలని కోరారు. మేడా మస్తాన్ రెడ్డి, నక్కా లక్ష్మణరావు, ఇమంది ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో రమేష్‌నాయుడు తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వైరస్‌లపై అప్రమత్తత అవసరం

బీచ్ రోడ్డు: దేశ వ్యాప్తంగా హెచ్3ఎన్2 ఫ్లూ కేసుల సంఖ్య పెరుగుతుందని, చిన్నారుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పీడియాట్రిక్ డాక్టర్ గణేష్‌బాబు అన్నారు. శుక్రవారం ఓ హోటల్‌లో ఫ్లూ వైరస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు వయసు గల పిల్లలు త్వరగా జ్వరాల బారిన పడే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. సీజన్ మారినప్పుడు ఇటువంటి ఫ్లూ వైరస్‌లు విజృంభిస్తాయని చెప్పారు. భౌతిక దూరం, పరిశుభ్రత పాటించాలన్నారు.

రేపు ఉచిత ఆర్థో వైద్య శిబిరం

బీచ్ రోడ్డు: కీళ్ల, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న రోగులకు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు శ్రీశివాని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్ మనోజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రోగులను పరీక్షించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా ఎక్స్‌రే, ఎముకల సాంద్రత పరీక్షలు చేస్తామన్నారు. ఈ శిబిరం మహారాణిపేటలోని శ్రీశివాని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. పూర్తి వివరాల కోసం 98855 51943 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఈకో రైల్వే అంతర విభాగాల స్పోర్ట్స్ మేళా ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: తూర్పు కోస్తా రైల్వే అంతర విభాగాల స్పోర్ట్స్ మేళాను శుక్రవారం రైల్వే స్టేడియంలో డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ప్రారంభించారు. ఈకోర్సా వాల్తేర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 13 విభాగాలకు చెందిన 19 జట్లు పలు క్రీడాంశాల్లో తలపడనున్నాయి. తొలుత ధ్యాన్‌చంద్ అవార్డీ స్టేడియంలో జ్యోతిని ప్రదర్శించగా.. డీఆర్ఎం క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం డీఆర్ఎం మాట్లాడుతూ అన్ని జట్లు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈకోర్సాడబ్ల్యూడబ్ల్యూఓ అధ్యక్షురాలు పారిజాత, ఉపాధ్యక్షులు కవిత, మధుమిత, ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్, మనోజ్‌కుమార్, క్రీడాధికారి ప్రవీణ్ భాటి, సహాయ క్రీడాధికారి అవినాష్, తదితరులు పాల్గొన్నారు. క్రికెట్ ప్రారంభ పోటీలో మెకానికల్ జట్టు 40 పరుగుల తేడాతో సిగ్నల్ టెలికాం జట్టుపై విజయం సాధించింది. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఎలక్ట్రికల్ టీఆర్‌డీతో ఎలక్ట్రికల్ ఆపరేషన్స్ జట్టు తలపడింది.

రంజింపజేసిన మధుర గీతాలు



సినీ గీతాలు పాడుతున్న గాయనీ గాయకులు

సీతంపేట: పాటే మీ మా ప్రాణం సంగీత సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను రంజింపజేసింది. సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపకుడు నాగులపల్లి వెంకటేశ్వరరావు అమ్మను స్తుతిస్తూ పాడిన పాట ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంది. పళ్ల వెంకటేష్ నిర్వహణ, వ్యాఖ్యానంలో నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు హిట్ చిత్రాల్లోని పాటలు ఆలపించి ఆకట్టుకున్నారు. సింగర్లు మాధురి, జాస్మిన్, రత్నకుమారి, గౌరీ, బి.సత్యనారాయణ, రాజారావు, వెంకటేష్, వేణుగోపాల్, సారధి, ఆదిలక్ష్మి, రాంబాబు, సుజాత, రామ్ కుమార్, జిలాని, కుమారి హుషారైన గీతాలు పాడి అలరించారు.

సమస్త విజ్ఞాన ప్రపూర్ణుడు అంబేడ్కర్



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: సమస్త, సమగ్ర విజ్ఞాన పరిపూర్ణుడు భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అని ఏయూ విద్యార్థులు ప్రతిధ్వనించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఏయూ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ×ఇంటర్ డిసిప్లీనరీ థాట్స్– డాక్టర్ బీఆర్ అంబేడ్కర్×అంశంపై నిర్వహించిన చర్చా వేదికలో వర్సిటీకి చెందిన ఫార్మసీ, ఇంజినీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ, న్యాయ, ఆర్ట్స్ కళాశాలలకు చెందిన 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అంబేడ్కర్ తన జీవితకాలంలో ఈ రంగాలకు చేసిన విశేష సేవలను వేదికపై ఆవిష్కరించారు. న్యాయ కళాశాల విద్యార్థిని డి.హర్షిత మాట్లాడుతూ వర్ణ వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా అంబేడ్కర్ పనిచేశారని చెప్పారు. కంప్యూటర్ సైన్స్ విభాగ విద్యార్థిని శ్రేయ మాట్లాడుతూ నేడు దేశంలో అందుబాటులోకి వచ్చిన డిజిటల్ ఇండియా అంబేడ్కర్ ఆశయాన్ని సాకారం చేస్తోందని చెప్పారు. సైన్స్ కళాశాల విద్యార్థిని రేష్మ మాట్లాడుతూ దేశంలో ప్రఖ్యాత శాస్త్ర పరిశోధన కేంద్రాలను నెలకొల్పడంలో రాజ్యాంగ నిర్మాత కృషిని వివరించారు. జర్నలిజం విభాగ విద్యార్థిని జి.కల్యాణి మాట్లాడుతూ దేశ ప్రగతికి, సామాజిక మార్పునకు ప్రసార మాధ్యమాలు ఉపయుక్తంగా నిలవాలని అంబేడ్కర్ ఆశించారని, ఆయనే స్వయంగా పలు పత్రికలను నిర్వహించిన సందర్భాన్ని గుర్తు చేశారు. ఫార్మసీ విద్యార్థి చిదానంద, న్యాయ విద్యార్థిని యమున శ్రీ, సైన్స్ కళాశాల విద్యార్థిని అలేఖ్య, తదితరులు మాట్లాడుతూ అంబేడ్కర్ విభిన్న రంగాలకు చేసిన కృషిని వివరించారు.

ఈ సందర్భంగా ఏయూ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ విభిన్న శాస్త్రాలపై అపార అనుభవం కలిగిన మేధో శక్తిగా భారతరత్న బీఆర్ అంబేడ్కర్ నిలుస్తారన్నారు. అంబేడ్కర్ చైర్ భవిష్యత్ కార్యాచరణను ఆచార్య జేమ్స్ స్టీఫెన్ వివరించారు. ఉదయం అంబేడ్కర్ చైర్ కేంద్రంలో విద్యార్థులు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. సైన్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య కె.జ్ఞానమని, హైకోర్టు సీనియర్ న్యాయవాది జయప్రకాష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి



మృతి చెందిన ద్విచక్ర వాహన చోదకుడు

అల్లిపురం: ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్రవాహన చోదకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం సాయంత్రం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సాయంత్రం 6.45 గంటల సమయంలో వెలంపేట బస్ స్టాప్ వద్ద ఆర్టీసీ బస్ ద్విచక్రవాహనంపై వెళుతున్న యువకుడిని ఢీకొనడంతో అతను బస్సు వెనుక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు బుక్కావీధికి చెందిన సూరాడ నరేష్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.